# సుబ్బారావుకు కోపమొచ్చింది!

సుబ్బారావు బ్రహ్మచారేంకాదు. పెళ్ళి చేసుకున్న కుర్రాడు! ఓ ప్రభుత్వాఫీసులో దమ్మిడి ఆదాయం లేకుండా కేవలం నెలజీతంమీదే ఆధారపడి బతుకుతున్న దురదృష్టవంతుడు. అయినా చింతలేదు. పేరెంట్స్‌తో వుంటున్నాడు కనుక తనకు భార్యకు కలిపి నెల ఇంటిఖర్చు కింద ఓ రెండువేలు నెలనెలా డాడీ చేతుల్లోపెడితే... మిగతా బ్యాలన్స్ గురించి అడిగే వారెవరూ లేరు.

సీట్లో పన్లేకపోవటంతో అలా బైటకెళ్ళి ఓ చాయ్ లాగించి పాన్ పంటికింద పెట్టుకుని తిరిగొచ్చి సీట్లో కూర్చోగానే నర్సింగ్‌హోం నుండి ఫోనొచ్చిందని ప్యూన్ చెప్పటంతో ఆ తొందరల్లో పర్మిషన్ లెటరైనా బాసుగాడి టేబుల్‌మీద పెట్టకుండా... బహుశా శ్రీమతికి పురుడొచ్చి వుంటుందనే నిర్ణయానికొచ్చి సిటీ బస్సెక్కి నర్సింగ్‌హోం చేరుకుని వార్డువేపు నడుస్తూండగ... అత్తగారు ఎదురై 'నీకు ఆడపిల్ల పుట్టింది అల్లుడూ' అన్చెప్పింది.

ఆ మాటలు విన్న సుబ్బారావుకి చిర్రెత్తుకొచ్చింది. మగబిడ్డ పుట్టి వుంటాడనే సంబరంలో తానొస్తే ఆడపిల్లని భార్య కన్నదనే విషయం అత్తగారి నోటివెంట విన్పించేనరికి వళ్ళుమండింది!

'సిజేరియన్ కావటాన అమ్మాయి బిడ్డ ఇంకా ఆపరేషన్ థియేటర్లోనే వున్నారు... సాయంకాలానికి గాని వార్డుకి మార్చరట...'' మళ్ళీ అత్తగారే అంది.

అత్తగారి ముఖంలోకి గుర్రుగ చూచి సుబ్బారావు పళ్ళు పటపట కొరికి పక్కనే వున్న స్పిటూన్‌లో కాండ్రించి వుమ్మాడు. కోపంతో ముఖం జేవురించింది.

మాట పలుకులేకుండా గిర్రున వెనుతిరిగి సిటీ బస్కెక్కి మళ్ళీ ఆఫీసుకొచ్చాడు.

వచ్చి సీట్లో తగలడకముందే ఇప్పటికే పాతికసార్లు పిలిచాడనీ... తాను సీట్లో లేనందున కారాలు మిరియాలు నూరుతున్నాడనే విషయం ప్యూన్ సన్యాసి చెప్పడంతో బాస్ గదిలోకి జొరబడ్డాడు సుబ్బారావ్!

'నువ్వెక్కడికి పోయి చచ్చావ్? ఆఫీసంటే అంత లోకువైందా? వచ్చి అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం గిలికి గాలికి తిరిగితే జీతం వచ్చేస్తుంది కదానే ధీమానా?...' చెడామడా వాయించాడు బాస్.

ఒకవేపు ఆడపిల్ల పుట్టిందేనన్న బాధ... మరోవేపు బాస్‌గాడు రౌద్రరూపం దాల్చి అవాకులు చెవాకులు పేలటం చూస్తూ గుడ్లనీరు కుక్కుకున్నాడు.

అనరాని మాటలన్న బాస్‌గాడి మీదకి హనుమంతునిలా లంఘించి పీక పుచ్చుకు

పిసికేయాలన్నంత కోపం వచ్చినా... అనువుగాని చోట అధికులమనరాదనే పద్యం గుర్తుకొచ్చి... బావురుమన్నాడు.

'ఏమిటి? ఏమిటా ఏడుపు? ఎందుకేడుస్తున్నట్టు. చెప్పి చావ్. లేకపోతే నేను నిన్ను రేప్ చేశానంటూ నీ వెనక వుండే ఉద్యోగసంఘాలు దుమ్మెత్తిపోస్తయ్! అసలు పాయింట్‌కిరా... విషయం చెప్పి చావు...' కస్సుమన్నాడు బాస్.

'నాకు ఆడపిల్ల పుట్టింది సార్...' ఘొల్లుమన్నాడు.

'ఓరి నీ దుంపతెగిపోను. ఆడపిల్లంటే అదృష్టంరా నన్నాసీ! మగవెధవాయిలు ముసలోళ్లమయినాక మనల్ని చూసేదవరు. ఆడపిల్లలే నయం! అయ్యో... మమ్మీ డాడీల్లే అని పిసరంత జాలి చూపుతారు. కాబట్టి ఏడుపు ఆపు. షటప్...' పకపకా నవ్వేడు బాస్.

బాస్‌గాడి నవ్వుకి సుబ్బారావుకి తిక్కరేగింది బాస్ కామెడీ ఎందుకు అభినయిస్తున్నట్లో బోధపడ్లేదు

'ఒరేయ్ గుమస్తా పీనుగా... ఆడపిల్ల పుట్టిందనేసి ఇరానీ హోటల్లో చాయో... పుల్లారెడ్డి స్వీటో ఇచ్చావో... నేనూర్కోను. సస్పెండ్ చేస్తాను. ఎంచక్కా ఇద్దరం కలిసి నా కార్లో ఏ కాస్టలీ బార్‌కో వెడదాం. (సారీ మద్యపానం హానికరం) అక్కడే తెల్లార్లూ గడిపేద్దాం... బిల్లు నువ్ పే చేద్దువుగాని...' మళ్ళీ భళ్ళున నవ్వాడు బాస్.

ప్రతి విషయానికీ బోలెడంత నవ్వటం బాస్‌కి హేబిట్! విరగబడి నవ్వుతాడు. పగలబడి నవ్వుతాడు. అదేమంటే నవ్వు ఆరోగ్యానికి మంచిదంటూ ఉపన్యాసం దంచేస్తాడు.

బాస్‌గాడి రాక్షసనవ్వు... వికటాట్టహాసానికి అరికాలి మంట నెత్తికెక్కింది సుబ్బారావుకి.

నవ్వాకురా జోకర్‌వెధవాని గట్టిగగా అరవాలనుకున్నాడు. కానీ బాస్‌కదా... నోరు పెగల్లేదు. వాడితో బోలెడు పన్లుంటయ్. ఒక్కరోజుతో పోయేదా? నలభైయేళ్ళు వాడి చెప్పుచేతల్లో వుంటూ కొలువు చేయాలాయె?

'ఇదిగో సుబ్బారావ్... నువ్వు నాకు పార్టీ ఇవ్వకపోతే నీ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ స్పాయిల్ చేస్తాను. నీ ఇంక్రిమెంట్ కట్...'

బాస్ మాటలకు అద్దొచ్చి 'బాబ్బాబు... అంత పని చేయకండి... మీకు పుణ్యముంటుంది. నాకష్టార్జితంలో నుంచి ఎంత ఖర్చయినా సరే... అయిదు నక్షత్రాల హోటల్లో జబర్దస్తీ పార్టీ ఇచ్చుకుంటాఈ భృత్యుడు. కనికరించండి...' అంటూ అమాంతం కాళ్ళమీద పడ్డాడు సుబ్బారావు.

'సో... యుకెన్ గో...!' అనటంతో బాస్ ఛేంబర్లోంచి విసిరేసిన బంతిలా తలుపు తోసుకుని బైటపడి చెమటపట్టిన జిడ్డు ముఖాన్ని కర్చీఫ్‌తో తుడుచుకుని వుస్సురోమంటూ తన సీట్లో సెటిలైనాడు.

ఫైళ్ళు చూడబుద్ధి కావటంలేదు. ఒక పక్క ఆడపిల్ల పుట్టి చచ్చిందని ఏడుపు... మరోవైపు బాసు క్లాసు పీకాడని బాధ... రెంటితో సతమతమవుతున్నాడు.

టైమెంతయిందో కూడా చూచుకోకుండా... ఆఫీసులో అందరూ వెళ్ళిపోయినా పిచ్చోడికి మల్లే తనొక్కడే జుట్టు పీక్కుంటూ దిగాలుపడి సీట్లో కూర్చున్నాడు.

'ఏంసారూ... ఆరు దాటింది లెగండి... ఇంటికి పోరా ఏంది?...' ఫ్యూన్ హంటర్‌పెట్టి కొట్టినట్టు మాట్లాడడంతో లేచి నీరసంగా ఆఫీసులోంచి బైటికొచ్చాడు.

ఇంటికెళ్ళి తన ముఖం ఎలా ఫాదర్ మదర్‌కి చూపటమానే మీమాంశలో పడ్డాడు కుడితిలోపడ్డ ఎలుకలాగా.

ఏం ముఖం పెట్టుకు ఇంటికెళ్లటం? ఆడపిల్లకి తండ్రినైనందుకే వళ్లంతా కంపరంగ వుంది. ఇంటికెడితే ఆడపిల్ల పుట్టినందుకు కాకుల్లా పొడుచుకుతింటారు. జవాబు చెప్పలేక పరేశానవాల్సివస్తుంది.

మగపిల్లాడు పుడతాడని ఎన్నో ఎన్నెన్నో తీపి కలలుకన్నాడు. ఊహల్లో తేలాడు. చివరికి తన ఆలోచనల్నీ తల్లకిందులే. పెళ్ళాం బ్రహ్మరాక్షసి ఆడపిల్లని ప్రసవించి ఏడ్చింది. మగబిడ్డని కనకుండా ఆడపిల్లని కన్నందుకు శ్రీమతి గొంతు పిసికి చంపేస్తే బావుండేది.

పోనీ... తన కూతుర్ని... ఏ చెత్తకుండీలోనో పడేస్తే...? కాకుంటే... వడ్లగింజ గొంతులో వేసి చంపేస్తే...? పోనీ... అదికాకుంటే ఏ అనాథ శరణాలయానికో అప్పగిస్తే.. ఇవేవీ బాగుండవనుకుంటే... ఏ గుడిమెట్ల మీదనైనా వదిలేస్తే? పోనీ. అర్ధరాత్రి మనుష్య సంచారం లేనప్పుడు హుసేన్‌సాగర్లోకి విసిరేసి చేతులు దులుపుకుంటే సరిపోదూ?

నో! అమ్మో పోలీసులు శవ పంచాయతీ చేసి కూపీలాగితే తాను దొరికిపోతే?... జైలుప్రాప్తి చిప్పకూడు తప్పదు. ఉద్యోగం వూడిపోతుంది.

ఇంతటి భయంకర క్లైమాక్స్ తాను తట్టుకోలేడు. ఆడపిల్ల కదాని పెంచి పెద్దచేయటానికీ మనస్కరించి చావటంలేదు.

ఇంటికి వెళ్ళబుద్ధికాక ఫ్రెండ్ రూమ్‌కెళ్ళాడు. సుబ్బారావు రాకకు నిర్ఘాంతపోయిన వెంకట్రావ్ 'ఇదేమిట్రా... దారి తప్పివచ్చావా?... ఇంట్లో అలిగి వచ్చావా?..' గుమ్మంలోనే నిలబెట్టి ప్రశ్నించాడు.

'నన్నేమీ అడక్కు...! వళ్ళు మండిపోతోంది' గదిలో మంచంమీద వాలిపోయాడు సుబ్బారావు.

'నా మనసేమీ బాగోలేదు. ఇంటికి వెళ్ళబుద్ధికాక నీ రూమ్‌కొచ్చాను.'

'మంచిపని చేశావ్! అయితే ఇంకేం ఓ ఫుల్ బాటిల్ పట్రానా?...'

'నేను తాగనని నీకు తెలుసుకదా...'

'పోనీ మరో ఇద్దర్ని కేకేస్తాను. తెల్లార్లూ ఎంచక్కా పేకాడదాం...'

'నాకు రానిదల్లా పేకాటవక్కటే...'

'అసలింతకూ నీ ప్రాబ్లమేమిటి?...'

'ఏమని చెప్పన్రా... నాకు ఆడపిల్ల పుట్టింది.' దుఃఖం కట్టలు తెంచుకుంది సుబ్బారావులో.

'ఓరి యూస్‌లెస్‌ఫెలో... ఈ మాత్రానికే దిగులుపడుతున్నావా? నిజంగా నువ్వో ఫూల్‌వి...'

'అదేంట్రా అట్లా అంటావ్?...'

'అవున్రా.... అన్ని విధాలా ఆడపిల్లలే నయం. నువ్ చదివించు... ఈ రోజుల్లో కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు మనం చేయాల్సిన అవసరం లేదు. రోజులు మారుతున్నయ్ కదా?! వాళ్ళే నచ్చినోడిని లవ్వాడేస్తారు. పేరెంట్స్‌కి ప్రాబ్లమ్ లేకుండాపోతుంది. ప్రేమించిన వాడితో సుఖంగా కాపురం చేస్తారా... సంతోషించటం... లేదూ కొట్టుకుచచ్చి విడిపోతారా... వాళ్ళ ఖర్మకు వదిలేయటం. దట్సాల్...! అంచేత... అనవసరంగా మనసు పాడుచేసుకోకు.....!' ఖుల్లి ఉపన్యాసం దంచాడు వెంకట్రావ్.

'ఓ రెండు రోజులు నీతో ఇక్కడే నీరూమ్‌లోనే వుండనీ... కాస్తంత కాక తగ్గేక అప్పుడు ఆలోచిస్తాను...' అన్చెప్పి బాత్‌రూమ్‌లోకి దూరేడు.

ఆ రాత్రంతా సుబ్బారావుకి కంటికి కునుకులేదు. నాలుగైదు తరాలుగ తమవంశంలో ఆడపిల్ల పుట్టి ఎరగదు. తాతల తండ్రుల కాలంనుండీ అందరికీ మగసంతానమే!

తానొక్కడే దౌర్భాగ్యుడు! ఆడపిల్ల పుట్టి తనను కలవరపెడుతోంది. ఎన్నివిధాల ఆలోచించినా రాజీపడ్లేకపోతున్నాడు.

★★★★★

'ఏరా అమ్మనాన్న ఇప్పుడు గుర్తుకొచ్చారా? రెండురోజులుగ ఇంటికి రాకుండా ఎక్కడికెళ్ళావ్... నువ్ తండ్రి వైనావ్ తెలుసా?... నీ భార్య ఆడపిల్లని కన్నదని మీ మామగారు ఫోన్ చేసారు...' గుమ్మంలోనే ఎదురై అంది తల్లి.

'ఏరా బడుద్ధాయ్... కూతురు పుట్టగానే కళ్ళు నెత్తికొచ్చి కన్నవాళ్ళనే మర్చిపోయి నువ్వా నర్సింగ్‌హోంలోనే పడి ఏడుస్తున్నావా?...' మెత్తగా చీవాట్లు పెట్టాడు తండ్రి.

తనకీ విషయాలు తెలీనట్టే మౌనం వహించాడు సుబ్బారావు. నేరుగా తన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

కొడుకు వాలకం చూచిన తల్లి అసలు నువ్వు వూళ్లోనే వున్నావా? మాట్లాడవేంరా... బెల్లం కొట్టిన రాయిలా గమ్మునుంటావేం? వంట్లో బాగోలేదా ఏం ?...' కొడుకును వెంబడిస్తూ ప్రశ్నల వర్షం కురిపించింది తల్లి.

"కూతురు పుట్టిందన్న ఆనందంలో వాడికి నోటమాట రావటంలేదు లేవే... వాడిని సతాయించకు. ఇప్పుడేగా కొంపకొచ్చింది. కాస్తంత కాలకృత్యాలు తీర్చుకోనీ..."

తండ్రి మాటల్లో వ్యంగ్యం సుబ్బారావుని మరింత ఏడిపించినట్టయింది.

'స్నానం గట్రా చేసి ఓ మారువెళ్ళి నీ కూతుర్ని నువ్ చూసొద్దామనుకున్నా వీల్లేదట.. ఎంచేతనంటే... పిల్ల పుట్టిన జన్మ నక్షత్రం మంచిదికాదట. శాంతి చేయించి తండ్రి నూనెలో పిల్లదాని ముఖం చూస్తేగాని దోషంపోదని నీ మామగారన్నారు?... కాబట్టి... బారసాల నాటివరకు నీవు కూతుర్ని చూచి మురుసుకునే యోగంలేదు...' చెప్పేసి తల్లి వంటింట్లోకెళ్ళింది.

'ఒరే సుబ్బూ... ఈ మురుగులు గొలుసు బాగున్నాయేమో చూడు...' నగలు చూపించింది కొడుక్కి.

'ఇవన్నీ ఇప్పుడెందుకమ్మా? డబ్బు దండగ...' విసుక్కున్నాడు.

'నోరు ముయ్యవోయ్. బారసాలకి వట్టి చేతులతో పోతే బంధువులంతా మనల్ని ఆక్షేపిస్తారు' తండ్రి కోప్పడ్డాడు.

'ఒకళ్ల కోసమా ఏమిటి? మనవరాలి కోసం మనం ముద్దు తీర్చుకుంటున్నాం...' తల్లి అందుకుంది.

'మగపిల్లాడై వుంటే ఇవన్నీ కొన్నా అర్థముంటుంది. ఆడపిల్లకివన్నీ ఎందుకమ్మా దండుగ...' అయిష్టాన్ని వ్యక్తపరిచాడు.

'అదిగో ఆ మాటే అనొద్దు! ఎవరైనా మనకు ముద్దే! నువ్వు నోరు మూసుకుని బారసాల చేసుకో! తిక్క వేషాలు వేసి మనకు చెడ్డపేరు తేవద్దు...!' నచ్చచెప్పింది తల్లి.

'నేరాను... మీరు వెళ్లండి...!'

'నువ్వు లేకుండా కార్యక్రమం ఎట్లా జరుగుతుందిరా పిచ్చిసన్నాసీ? పిల్ల ముఖాన్ని

నువ్వే కదా నూనెలో చూచి... తర్వాత ఒడిలోకి తీసుకోవలసింది...!

'అసలీ బారసాల ఎందుకు? ఆడపిల్లకివన్నీ అవసరమా?'

'నోర్మూయ్యరా పిచ్చి వెధవ. మారు మాట్లాడకుండా మావెంట బయల్దేరు.. మారు మాట్లాడకు...' తండ్రి శాసించటంతో కాస్త మెత్తబడ్డాడు సుబ్బారావు.

తెల్లవారి వియ్యాలవారింటికి బారసాల కార్యక్రమానికి సుబ్బారావుని వెంటతీసుకుని తల్లీ తండ్రీ బయల్దేరారు. అయిష్టంగానైనా బయల్దేరక తప్పలేదు సుబ్బారావు.

బారసాల కార్యక్రమంలో కూతురు ముఖం నూనెలో చూచినా పిల్లదాన్ని ఎత్తుకోదల్చుకోలేదు.

భార్యతో అత్తమామలతో మాట పలుకులేకుండా ముభావంగానే వున్నాడు.

సుబ్బారావుకి తన భార్య క్రీగంట తనను చూస్తూ ఎందుకు ముసిముసిగా నవ్వుతోందో బోధపడ్లేదు సరికదా... పైగా చిరాకుపడ్డాడు.

పురోహితుడు కార్యక్రమం ప్రారంభించాడు. ఆశీర్వచనం అయిన తర్వాత నూనెలో పిల్లదాని ముఖం చూసీ చూడనట్టే చూచి తల తిప్పుకున్నాడు. వెంటనే తెర అడ్డుతొలగటంతో ఇదిగో మీ బిడ్డని మీకు అప్పగిస్తున్నాను. ఇక మీ ఇష్టం...' అంటూ గభాలున తన చేతుల్లో వున్న బిడ్డని సుబ్బారావు ఒడిలో పడుకోబెట్టింది.

వెంటనే సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయిన సుబ్బారావు తేరుకోవటానికి కొన్ని నిముషాలు పట్టింది. తన ఒడిలో వున్నది పిల్లాడు! కూతురు కాదు. ఇదేమిటీ? అనుకున్న సుబ్బారావుకి అంతా అయోమయంగా తోచింది. వెర్రిమొహం వేసుకుని పక్కనేవున్న శ్రీమతి ముఖంలోకి పక్కనే వున్న డాడీమమ్మీల ముఖాల్లోకీ చూశాడు.

'ఒరే పిచ్చి సన్నాసీ... నిన్ను అందరం కలిసి ఏడిపించడంకోసమే ఆడపిల్ల పుట్టిందని అబద్ధం చెప్పాం! నీకు మగబిడ్డే పుట్టాడు' అని తండ్రి సస్పెన్స్ బ్రేక్ చేశాడు.

ఇన్నిరోజులుగా తనకు అబద్ధం చెప్పి వెర్రివాడిని చేసినందుకు సుబ్బారావుకి నిజంగానే కోపం వచ్చింది!!

- సమాప్తం -